క్లుప్తంగా

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

ఇల్లందకుంట: అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం చెల్లించాలని రైతు స్వరాజ్య వేదిక రాష్ట్ర కో కన్వీనర్ ఎం. ఐలయ్య, జిల్లా కన్వీనర్ రాచపల్లి సమ్మయ్య శుక్రవారం ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అకాల వర్షాలతో తీవ్రంగా నష్టపోయి పెట్టుబడి రాక నష్టపోతున్నారని, కౌలు రైతులను ప్రభుత్వం గుర్తించి ప్రభుత్వ సబ్సిడీ అందించాలని కోరారు. ఎన్నికల్లో ఇచ్చినా హామీ ప్రకారం రుణమాఫీ చేసి కొత్త రుణాలను ఇవ్వాలన్నారు. ప్రభుత్వం పంట బీమా పథకం అమలు చేసి నకిలీ విత్తనాలను అరికట్టాలని అన్నారు.

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత


మురుగు నీటిని తొలగిస్తున్న పారిశుధ్య సిబ్బంది

హుజూరాబాద్‌రూరల్: పరిసరాల శుభ్రత అందరి బాధ్యతని మున్సిపల్ చైర్ పర్సన్ గందె రాధిక ప్రజలకు సూచించారు. శుక్రవారం డ్రై డేలో భాగంగా పట్టణంలోని 28వ వార్డులో పర్యటించారు. ఈ సందర్భంగా ఇంటి పరిసరాలలు, ఖాళీ ప్రదేశాల్లో నిల్వ ఉన్న మురుగు నీటిని పారిశుధ్య సిబ్బందితో తొలగింపజేశారు. అనంతరం పరిశుభ్రతపై వార్డు ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కమిషనర్ సల్వాది సమ్మయ్య, ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ కిషన్‌రావు, శానిటరీ జవాన్ ఆరెల్లి రమేశ్, మెప్మా ఆర్పీలు పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌పై అవగాహన


అవగాహన కల్పిస్తున్న డీఎల్‌పీవో లత

శంకరపట్నం: స్వచ్ఛ సర్వేక్షణ్ ప్రశ్నావళిపై శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో డీఎల్‌పీవో లత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల్లో మరుగుదొడ్ల వాడకం, పరిసరాల పరిశుభ్రత, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో శుభ్రతపై త్వరలో కేంద్ర బృందం పర్యటించనుందన్నారు. ప్రజలకు స్వచ్ఛతపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యకరమంలో ఎంపీడీవో బషీరొద్దీన్, ఏపీవో శారద, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు.

హద్దురాళ్లు తొలగింపు



రామడుగు: మండలంలోని దేశరాజ్‌పల్లి గ్రామ పంచాయతీ పరిధి సర్వే నంబర్ 407లోని సీలింగ్ భూమిలో రియల్టర్లు ప్లాట్లు చేస్తూ హద్దురాళ్లు ఏర్పాటు చేశారు. దీంతో గ్రామ పంచాయతీ సిబ్బంది శుక్రవారం అక్రమంగా ఏర్పాటు చేసిన హద్దురాళ్లు తొలగించారు.

ఓటరు నమోదుపై సమీక్ష


ఓటరు నమోదుపై సమీక్షిస్తున్న ఆర్డీవో

సైదాపూర్: తహసీల్దార్ కార్యాలయంలో ఓటరు నమోదు కార్యక్రమంపై శుక్రవారం హుస్నాబాద్ ఆర్డీవో బెన్ శాలమ్ సమీక్షించారు. ఓటరు నమోదు కార్యక్రమం పొడిగించే అవకాశం లేదని హుస్నాబాద్ ఆర్డీవో బెన్ శాలమ్ అన్నారు. దరఖాస్తులను పూర్తి చేసి అన్ని ఆధారాలతో సంబంధిత అందరూ అధికారుల సంతకాలతో ఈఆర్వోకు సమర్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ బాపుసింగ్, బూత్ లెవల్ అధికారులు పాల్గొన్నారు.

పనితీరుతోనే ఉద్యోగులకు గుర్తింపు


సన్మానిస్తున్న ప్రజా ప్రతినిధులు, అధికారులు

చొప్పదండి: ఉద్యోగులు పనితీరుతోనే గుర్తింపు పొందుతారని ఎంపీపీ చిలుక రవీందర్ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం సబ్‌ఆర్డినేట్ పదవీవిరమణ సన్మాన సభ నిర్వహించారు. ఇరవై ఐదేళ్లుగా సేవలు అందించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో స్వరూప, మాజీ జడ్పీటీసీ ఇప్పనపల్లి సాంబయ్య, నరేశ్ ఆనంద్, రాజగోపాల్ రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, పాల్గొన్నారు.

ప్రతిపాదనలకే పరిమితం..

- జీటీ రోడ్లకు నోచుకోని గ్రామాలు
- వర్షాకాలంలో మట్టిరోడ్లపై ఇబ్బందిపడుతున్న ప్రజలు
- అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా స్పందన కరువు
- పంటపొలాలకు వెళ్లేందుకు రైతుల నానా అవస్థలు


కొత్తగట్టు-కేశవపట్నం మట్టిరోడ్డు

శంకరపట్నం: మండలంలోని వివిధ గ్రామాలు బీటీరోడ్లకు నోచుకోవడం లేదు. దీంతో ప్రయాణికులు, వాహనదారులు, రైతులు ఏటా వానాకాలంలో ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. కొత్తగట్టు-కేశవపట్నం గ్రామాల మధ్య ఉన్న మట్టిరోడ్డుతో రైతులు పంటపొలాల వద్దకు వెళ్లేందుకు వర్షాకాలంలో నానా అవస్థలు పడుతున్నారు. కేశవపట్నం, కొత్తగట్టు, సైదాపూర్ మండలం వెన్నంపల్లి, సోమారం, ఎగ్లాస్‌పూర్, బూడిదపల్లి, లస్మన్నపల్లి రైతులు నిత్యం ఈరోడ్డుపై పంట పొలాల వద్దకు వెళ్తారు. వర్షాకాలంలో కేశవపట్నం వాగు ప్రవహిస్తే చుట్టూ ఆరు కిలోమీటర్లు తిరిగి పంట పొలాల వద్దకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. దూరభారం తగ్గించేందుకు కేశవపట్నం వాగుపై బ్రిడ్జి నిర్మాణంతోపాటు బీటీ రోడ్డు వేసేందుకు ఏడాది క్రితం ప్రభుత్వానికి అధికారులు ప్రతిపాదనలు పంపారు. బ్రిడ్జి, రోడ్డు నిర్మాణం కోసం నిధులు మంజూరయ్యాయని అధికార పార్టీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. ఇప్పటివరకు ఎటువంటి పురోగతి లేదని ప్రజలు విమర్శిస్తున్నారు.

గ్రానైట్‌క్వారీతో వెలుగులోకి

కేశవపట్నం శివారులో ఉన్న గుట్టను ఇరవై ఏళ్ల క్రితం గ్రానైట్ క్వారీకి అధికారులు అనుమతి ఇచ్చారు. పూర్వం నక్షాబాట ఉన్నప్పటికీ వర్షాకాలంలో బురదమయంగా ఉండేది. కొంతమంది రైతులు నక్షాబాటను ఆక్రమించడంతో ట్రాక్టర్, లారీ వెళ్లేందుకు ఇబ్బందులు ఉండేవి. క్వారీకి అనుమతి ఇవ్వడంతో గ్రానైట్‌ను లారీల్లో తరలించేందుకు సర్వే చేయించిన క్వారీ వ్యాపారులు మొరం పోయించారు. ఏటా మొరం పోసి రాకపోకలు సాగిస్తున్నారు. గ్రానైట్ వ్యాపారులతోపాటు రైతులు రోడ్డుపై వెళ్తున్నారు. వానకాలంలో వాగు దాట లేక ఇబ్బందులు పడుతున్నామని, బ్రిడ్జి, బీటీరోడ్డు నిర్మించాలని రెండు దశాబ్దాలుగా ప్రజాప్రతినిధులు, అధికారులకు కేశవపట్నం రైతులు వినతిపత్రాలు ఇచ్చారు. ఏడాది క్రితం బ్రిడ్జితోపాటు రోడ్డు మంజూరైందని అధికార పార్టీ నాయకులు సంబరాలు చేసుకున్నా ఇంత వరకు పనులు ప్రారంభించలేదు.

నడవలేకపోతున్నాం



కేశవపట్నం, కొత్తగట్టు గ్రామాల మధ్య బీటీ రోడ్డు వేయాలి. చినుకు పడితే బురదమయంగా మారే రోడ్డుపై నడవలేకపోతున్నాం. నక్షబాట ప్రకారం రోడ్డు పనులు చేస్తే పొలాల వద్దకు వెళ్లే రైతులకు బాధలు తీరుతాయి.
– మ్యాకల స్వామి, రైతు, కేశవపట్నం

బ్రిడ్జి నిర్మించాలి



మాఊరి నుంచి బ్యాంక్, ఎరువులు, ఇతర సామాను కోసం బైక్, ట్రాక్టర్, ఆటోలపై వస్తుంటాం. కొత్తగట్టు, కేశవపట్నం గ్రామాల మధ్య బ్రిడ్జి నిర్మిస్తే దూరం తగ్గి సైదాపూర్ మండల కేంద్రానికి వెళ్లవచ్చు.
– క్రాంతి, ఎక్లాస్‌పూర్, సైదాపూర్ మండలం

ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం

కేశవపట్నం-కొత్తగట్టు గ్రామాల మధ్య బీటీ రోడ్డు, కేశవపట్నం వాగుపై బ్రిడ్జి నిర్మాణం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. ప్రభుత్వ వెంటనే స్పందించి టెండర్ నిర్వహిస్తే త్వరలోనే పనులు ప్రారంభమవుతాయి.
– తిరుపతి, ఏఈ

ఎంపీపీపై అవిశ్వాస తీర్మానం



ఆర్డీవో కార్యాలయ ఆవరణలో ఎంపీటీసీ సభ్యులు

హుజూరాబాద్: హుజూరాబాద్ ఎంపీపీ రాణిపై మరోసారి ఎంపీటీసీ సభ్యులు శుక్రవారం ఆర్డీవో హరిసింగ్‌కు అవిశ్వాస తీర్మాన పత్రతం అందజేశారు. అనంతరం ఆర్డీవో కార్యాలయ ఆవరణలో మాట్లాడారు. ఎంపీటీసీలను పరిగణనలోకి తీసుకోకుండానే ఎంపీపీ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని, అభివృద్ధి పనుల విషయంలో ఎంపీపీ భర్త జోక్యం మితిమీరితుందని అందుకే అవిశ్వాస తీర్మానం పెట్టామని తెలిపారు. 12 మంది ఎంపీటీసీ సభ్యులకు పదిమంది అవిశ్వాస తీర్మాన పత్రం అందజేయటంతో అధికార పార్టీలో మరోసారి విభేదాలు బయటపడ్డాయి. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బండి రమేశ్ ఎంపీటీసీ సభ్యులు ఉన్నారు.

రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం


క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

రామడుగు: మండల కేంద్రంలో శుక్రవారం కరీంనగర్ పార్లమెంట్ యువజన కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు నాగి శేఖర్ ఆధ్వర్యంలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. గతంలోనే కాంగ్రెస్ పార్టీ రైతులకు ఉచిత విద్యుత్ ఇచ్చిందని, రేవంత్‌రెడ్డి మాటలను వక్రీకరించి బీఆర్ఎస్ నాయకులు చిల్లర రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు శ్యాంసుందర్‌రెడ్డి, పిండి శ్రీనివాస్‌రెడ్డి, నాగరాజు, మాణిక్యం, నీలం దేవకిషన్, పొన్నం శంకరయ్య, ఎల్లయ్య, కనకయ్య, అనీఫ్, సత్యం, పోచమల్లు, ఎల్లయ్య పలువురు పాల్గొన్నారు.

వినూత్న రీతిలో నిరసన

శంకరపట్నం: మండలంలోని కొత్తగట్టు గ్రామంలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ యూత్ నాయకులు వినూత్న రీతిలో నిరసన తెలిపారు. గ్రామంలో 2015లో అంగన్‌వాడీ భవనం నిర్మాణానికి ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ శంకుస్థాపన చేశారు. ఎనమిదేళ్లు గడిచినా నిర్మాణం చేయలేదని కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షుడు ఎడ్ల రాజు, సీనియర్ నాయకుడు ఎడ్ల కొండాల్, సోషల్‌మీడియా కోఆర్డినేటర్ ఎడ్ల శివ శిలాఫలకానికి క్షీరాభిషేకం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత నిర్మిస్తుందన్నారు.

సంక్షిప్త వార్తలు

● ఏబీవీపీ ఆధ్వర్యంలో నిరసన

చొప్పదండి: మార్పు కోసం మహా ఉద్యమంలో భాగంగా ఏబీవీపీ ఆధ్వర్యంలో పట్టణంలోని మార్కెట్ చౌరస్తాలో శుక్రవారం విద్యార్థులు మానవహారం నిర్వహించి నిరసన తెలిపారు. ప్రాణత్యాగాలు చేసి తెచ్చుకున్న తెలంగాణలో అన్నివర్గాల ప్రజలను నయవంచన చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వాన్ని గద్దె దించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో రేషవేణి వేణు, మునిగంటి రాజు, జాప కుమార్, పిట్టల శ్రీనివాస్, రాజన్నల సాగర్, గంట మహేశ్, సిద్దిక్ అలీ, తదితరులు పాల్గొన్నారు.

● వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు

శంకరపట్నం: మండలంలోని కొత్తగట్టు గ్రామానికి చెందిన తూముల లక్ష్మణ్‌రావు(60) కనిపించడం లేదని శుక్రవారం ఆయన భార్య మణెమ్మ ఫిర్యాదు చేసినట్లు ఇన్‌చార్జి ఎస్సై సురేందర్ తెలిపారు. ఈ నెల13న ఉదయం ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి ఇంటికి తిరిగిరాలేదని, బంధువులను సంప్రదించినా ఆచూకీ లభించలేదని తెలపడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌చార్జి ఎస్సై పేర్కొన్నారు.

● కరపత్రాల పంపిణీ

రామడుగు: మండలంలోని రంగసాయిపల్లి గ్రామంలో శుక్రవారం బీజేపీ నాయకులు మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా కేంద్ర ప్రభుత్వం తొమ్మిదేళ్లలో చేపట్టిన అభివృద్ధి పనులను తెలియజేస్తూ ఇంటింటికి కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కట్ట రవీందర్, మునిగంటి శ్రీనివాసాచారి, శేఖర్, లింగపల్లి శ్రీనివాస్, సాయికృష్ణ, తిరుపతి, రమేశ్ పలువురు పాల్గొన్నారు.

● కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

గంగాధర: మున్నూరుకాపు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని గంగాధర మండల పరిషత్ అధ్యక్షుడు బోనాల శ్రీరాం మధుకర్ ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణ మున్నూరుకాపు సంఘం పిలుపు మేరకు మండల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ రాసిన ఉత్తరాలను విడుదల చేశారు. రాష్ట్రంలో 40 లక్షల మంది మున్నూరుకాపులు ఉన్నారని అధిక శాతం కూలి చేసుకునే వారని ప్రభుత్వం అండగా ఉండాలని కోరారు.

● ఆర్ఎంపీ, పీఎంపీల హర్షం

జమ్మికుంట: ఆర్ఎంపీ, పీఎంపీలకు రాష్ట్ర ప్రభుత్వం శిక్షణతో కూడిన సర్టిఫికెట్‌ను అందజేస్తామని ప్రకటించడంపై గ్రామీణ వైద్యుల సంక్షేమం సంఘం మండల అధ్యక్షుడు పైడిపల్లి భీమన్న హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వానికి ఋణపడి ఉంటామని, సీఎం కేసీఆర్, వైద్యఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు ఆర్ఎంపీ, పీఎంపీలను గుర్తించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు వేముల అశోక్, ప్రధాన కార్యదర్శి గ్యారంపల్లి రాజేశ్వర్ రావు, గోపీ, భిక్షపతి, అప్పాల సదానందం, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

● మూఢనమ్మకాలపై పోలీసు కళాజాత

శంకరపట్నం: మండలంలోని తాడికల్ గ్రామంలో శుక్రవారం రాత్రి పోలీసు కళాజాత బృందం మూఢనమ్మకాలు, మాదక ద్రవ్యాల నియంత్రణపై కళాప్రదర్శన చేశారు. యువత దురాటవాట్లు, వ్యసనాలకు లోనుకావద్దన్నారు. కేశవపట్నం ఇన్‌చార్జి ఎస్సై సురేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

● కప్పతల్లి ఆడిన రైతులు

హుజూరాబాద్‌రూరల్: ఆశించిన స్థాయిలో వానలు కురువకపోవడంతో వరుణదేవుడు దయచూపి వర్షాలు కురిపించాలని శుక్రవారం మున్సిపాలిటీ పరిధి ఇప్పలనర్సింగాపూర్‌లో రైతులు కప్పతల్లి ఆడారు.

● విద్యుత్ వినియోగాదారుల సదస్సు

జమ్మికుంట: విద్యుత్ వినియోగదారుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని విద్యుత్ అధికారులకు టీఎస్ఎన్‌పీడీసీఎల్ వినియోగదారుల ఫోరం చైర్ పర్సన్ వేణుగోపాలచారి ఆదేశించారు. శుక్రవారం మున్సిపల్ పరిధి కొత్తపల్లి సబ్ స్టేషన్ ఆవరణలో జమ్మికుంట, వీణవంక, ఇల్లందకుంట మండలాల పరిధిలోని విద్యుత్ వినియోగదారుల సమస్యలపై సదస్సు నిర్వహించారు. మూడు మండలాల పరిధిలోని 26 మంది రాత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులు వెంటనే పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో వినియోగదారుల మెంబర్లు తిరుమల్‌రావు, చరణ్‌దాస్, నరేందర్, విద్యుత్ అధికారులు, వినియోగదారులున్నారు.

● కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

గన్నేరువరం: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని బీజేపీ, సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రం గన్నేరువరంలో సమ్మె చేస్తున్న కార్మికులకు శుక్రవారం మద్దతు తెలిపారు. పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు.

● సమ్మెకు ఎంపీటీసీ సంఘీభావం

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నంలో గ్రామ పంచాయతీ కార్మికులకు చేపట్టిన సమ్మెకు అధికార పార్టీకి చెందిన కన్నాపూర్ ఎంపీటీసీ మోతె భాగ్యలక్ష్మి సంఘీభావం తెలిపారు. ఉపసర్పంచ్ అడితం కుమార్, మాజీ వైస్ ఎంపీపీ ఎల్లారెడ్డి మద్దతు తెలిపారు. ప్రభుత్వం పట్టించుకోవడంలేదని బీజేపీ నాయకులు నాగరాజు, అజయ్‌వర్మ ఆరోపించారు.

● ప్రభుత్వం స్పందించాలి

చిగురుమామిడి: సమస్యలను ప్రభుత్వం తక్షణం పరిష్కరించాలని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ హుస్నాబాద్ నియోజకవర్గ కన్వీనర్ పచ్చిమట్ల రవీందర్ గౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం చిగురుమామిడిలో పారిశుధ్య కార్మికులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు.

● అంబేడ్కర్ విగ్రహాలకు నాయకుల వినతి

జమ్మికుంట: దళితులందరికి దళితబంధు, డబుల్ బెడ్‌రూం ఇంళ్లు, దళిత కులవృత్తుల వారికి రూ. ఐదువేల పింఛన్ మంజూరు చేయాలని బీజేపీ నాయకులు, మున్సిపల్ మాజీ చైర్మన్ శీలం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు జీడీ మల్లేష్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు.

గంగాధర: దళితుత సమస్యలు వెంటనే పరిష్కరించాలని మాజీ మంత్రి సుద్దాల దేవయ్య, బీజేపీ దళితమోర్చ రాష్ట్ర అధికార ప్రతినిధి జాడి బాల్‌రెడ్డిలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల దళిత మోర్చా అధ్యక్షుడు తాళ్ల రాజశేఖర్ ఆర్యంలో మధురానగర్ చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు.

గన్నేరువరం: దళితులందరికి దళితబంధు అమలు చేయాలని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ ముత్యాల జగన్‌రెడ్డి, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు బామండ్ల రాజు అన్నారు. మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు.

శంకరపట్నం: కేశవపట్నంలోని అంబేద్కర్ విగ్రహానికి బీజేపీ నాయకులు వినతిపత్రం అందించారు. దళితబంధుతో ఎస్సీల అభివృద్ధి అంటూ రాష్ట్ర ప్రభుత్వం మోసం చేస్తుందని విమర్శించారు. విగ్రహం ముందు నిరసన తెలిపారు.

చొప్పదండి: మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి జాడి బాల్‌రెడ్డి, బీజేపీ దళిత మోర్చా ఆధ్వర్యంలో వినతి పత్రం అందించారు.

మానకొండూర్: బీజేపీ ఎస్సీ మోర్చా మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆరెల్లి శ్రీహరి, కోంద్ర సురేష్ ఆధ్వర్యంలో మానకొడూర్ మండల కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు.

మరమ్మతులు చేయాలని వినతి


ఎమ్మెల్యే రవిశంకర్‌తో దేశరాజ్‌పల్లి గ్రామస్తులు

రామడుగు: మోతె వాగు నుంచి కోరటపల్లి ఫీడర్ చానల్ గతేడాది కురిసిన వర్షాలకు ధ్వంసమైందని, తక్షణం మరమ్మతులు చేయాలని దేశరాజ్‌పల్లి గ్రామస్తులు శుక్రవారం ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఫీడర్ చానల్ దెబ్బతినడంతో దేశరాజ్‌పల్లి ఊర చెరువులోకి నీరు రాని పరిస్థితి ఉందని తక్షణం నిధులు కేటాయించి మరమ్మతులు చేసేలా చూడాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ వంచ మహేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎల్కపల్లి లచ్చయ్య, నాయకులు పెగడ శ్రీనివాస్, పిట్టల నర్సయ్య, నిమ్మనవేణి అంజయ్య, సురేశ్ గ్రామ రైతులు, తదితరులు పాల్గొన్నారు.

సబ్ మార్కెట్ యార్డుకు స్థల సర్వే చేయండి


మాట్లాడుతున్న జెడ్పీటీసీ రవీందర్

చిగురుమామిడి: మండల కేంద్రంలో సబ్ మార్కెట్ యార్డు కోసం ప్రభుత్వ స్థలం కోసం సర్వే చేయించాలని జెడ్పీటీసీ గీకురు రవీందర్ కోరారు. శుక్రవారం తహసీల్దార్ జింక జయంత్‌ను మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రామోజు రజితకృష్ణమాచారి, డైరెక్టర్ కొత్త కైలాసంతో కలిశారు. చిగురుమామిడిలో స్థలం అందుబాటులో లేకపోతే సుందరగిరి గ్రామపంచాయతీ పాలకవర్గం 133 సర్వే నంబర్‌లో అనువైన స్థలం ఉందని, తీర్మానం కూడా ఇచ్చినందున త్వరగా సర్వే చేయించాలన్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు తన జన్మదినం సందర్భంగా సబ్ మార్కెట్‌కు అవసరమయ్యే నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. అలాగే హుస్నాబాద్ మార్కెట్ కమిటీ పాలకవర్గం సైతం చిగురుమామిడికి సబ్ మార్కెట్ యార్డు ఏర్పాటు చేసేందుకు తగిన తీర్మానం చేసిందన్నారు. వెంట పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే రైతులకు మేలు


నిరసన వ్యక్తం చేస్తున్న కవ్వంపల్లి సత్యనారాయణ

మానకొండూర్: కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే రైతులకు మేలు జరిగిందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి మాటలను వక్రీకరిస్తూ... శవయాత్ర, దిష్టిబొమ్మలను దహనం చేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం మానకొండూర్‌లో సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ శవయాత్ర, మంత్రి కేటీఆర్ దిష్టిబొమ్మను ఉరితీసి కరీంనగర్ వరంగల్ ప్రధాన రహదారిపై దహనం చేశారు. మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ముందు రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. రుణమాఫీ, ఉచిత కరెంట్, పంటరుణాలు, ఐకేపీ ద్వారా ధాన్యం కొనుగోలు చేసి రైతులను ఆదుకున్న ఘనత కాంగ్రెస్ పార్టీదేనని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రుణమాఫీ చేయకుండా ధరణి పేరుతో పేదల భూములు లాక్కుంటూ పంట నష్ట పరిహారం అందించకుండా రైతులపై వివక్షత చూపుతుందని మండిపడ్డారు. తరుగు పేరుతో ధాన్యం దోచుకుంటున్న మంత్రి గంగుల కమలాకర్, ఎమ్మెల్యే రసమయి రైతులకు ఏం న్యాయం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శిసంపత్ గౌడ్, జిల్లా నాయకులు దేవయ్య, శ్రీనివాస్, ఐదు మండలాల అధ్యక్షులు నందగిరి రవీంద్రచారీ, బసవయ్య, రవీందర్‌రెడ్డి, ఎంపీటీసీ చలిగంటి సంపత్, గట్టు రజిత శ్రీదర్, నాయకులు పాల్గొన్నారు.

గడపగడపకూ కాంగ్రెస్

సైదాపూర్: కాంగ్రెస్ హయాంలోనే గ్రామాలు అభివృద్ధి చెందాయని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని జాగీర్‌పల్లిలో గడపగడపకూ కాంగ్రెస్ కార్యక్రమం నిర్వహించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం సంక్షేమాన్ని విస్మరించిందని, పల్లెల అభివృద్ధిని పట్టించుకోవడంలేదన్నారు.

బాధ్యతలు స్వీకరణ


శుభాకాంక్షలు తెలుపుతున్న వీణవంక ఎస్సై ఆసీఫ్

హుజూరాబాద్‌రూరల్: హుజూరాబాద్ ఏసీపీగా శుక్రవారం ఎల్.జీవన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా డివిజన్‌లోని పోలీస్ సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఇక్కడ పనిచేసిన ఏసీపీ వెంకట్‌రెడ్డి బదిలీపై హైదరాబాద్‌కు వెళ్లారు.


ఇన్‌చార్జి ఎస్సైకి సన్మానం

శంకరపట్నం: కేశవపట్నం పోలీస్‌స్టేషన్ ఇన్‌చార్జి ఎస్సై సురేందర్‌ను శుక్రవారం పద్మశాలీ సంఘం నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గాజుల శ్రీనివాస్ తెలిపారు. సన్మానించిన వారిలో రవీందర్, రఘుపతి, సురేశ్, సారంగపాణి, శ్రీనివాస్, సదానందం, శంకరయ్య, భిక్షపతి, మురళీ, వాసు , కుమారస్వామి తదితరులు ఉన్నారు.

ఇల్లందకుంట ఎస్సైగా చంద్రశేఖర్

ఇల్లందకుంట: ఇల్లందకుంట ఎస్సైగా చంద్రశేఖర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఎస్ఐ మాట్లాడుతూ... మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని, ఎలాంటి సమస్యలున్నా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడే వారిపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. గతంలో పనిచేసిన తోట తిరుపతి బదిలీపై వెళ్లగా చంద్రశేఖర్ బదిలీపై వచ్చారు. ఎస్సైకి పోలీస్ సిబ్బంది పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు.

నియామకం


నియామక పత్రం అందిస్తున్న మల్లేశం

శంకరపట్నం: ముదిరాజ్ మహాసభ శంకరపట్నం మండల అధ్యక్షుడిగా లింగాపూర్ మాజీ సర్పంచ్ పాలవేని భిక్షపతిని నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు గుర్రాల మల్లేశం తెలిపారు. కులసంఘం బలోపేతానికి కృషి చేయాలని నియామకపత్రం అందజేశారు. నియామకానికి సహకరించిన బాలు, జెడ్పీటీసీ గీకురు రవీందర్, గూళ్ల రాజుకు భిక్షపతి కృతజ్ఞతలు చెప్పారు.

పాఠశాలల్లో బోనాల వేడుకలు


గంగాధర: బోనాలతో విద్యార్థులు,టీచర్లు

గంగాధర: మండలంలోని గట్టుభూత్కూర్ గ్రామం సాయి విద్యానికేతన్ పాఠశాలలో ఆషాఢమాసం సందర్భంగా శుక్రవారం బోనాల వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు డప్పు చప్పుళ్ల మధ్య బోనాల ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ విజయేందర్‌రెడ్డి, హెచ్ఎం గుండ నర్సయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.


చొప్పదండిలో..

చొప్పదండి: మండల కేంద్రంలో మహంకాళి బోనాలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు డప్పు చప్పుళ్ల మధ్య ఆలయానికి ఊరేగింపుగా వెళ్లి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు. డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి వేడుకల్లో పాల్గొని విద్యార్థులకు బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

మానకొండూర్‌లో విజయం సాధిస్తాం


మాట్లాడుతున్న సంజయ్‌కుమార్

మానకొండూర్: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో మానకొండూర్ నియోజకవర్గంలో విజయం సాధిస్తామని బీఎస్పీ రాష్ట్ర అధికార ప్రతినిధి జక్కని సంజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో బీఎస్పీ మానకొండూర్ అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమం పట్టించుకోవడం లేదని, బహుజన రాజ్యాధికారంతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. రాబోయే ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ముందుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో నాయకులు బోనగిరి ప్రభాకర్, మంద బాలయ్య, ఏనుగుల లింగయ్య, అక్కి బాలకిషన్, లింగాల శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.